# గోపాలరెడ్డికి రాజాలక్ష్మీ పురస్కారం



రాజాలక్ష్మీ ఫౌండేషన్ వారు 1989వ సంవత్సరం అవార్డును డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డికి సాహితీ అవార్డును డాక్టర్ తిరుమల రామచంద్రకు ఇచ్చి సత్కరిస్తున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి సల్పిన ప్రముఖులను సన్మానించి ప్రోత్సహించే ఉద్దేశంతో 1979లో రాజాలక్ష్మీ ఫౌండేషన్‌ను నెలకొల్పారు.

సలహాదారుల కమిటీ సూచనల మేరకు ఈ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ పి.వి.రమణయ్యరాజా అవార్డు గ్రహీతలను ఎంపిక చేసి ఆగస్టు 15న ప్రకటిస్తారు. నవంబర్ 19న ఏర్పాటుచేసే సభలో ఈ అవార్డులను అందిస్తారు.

ఏన్యువల్ అవార్డు పొందే వ్యక్తికి ఇరవై అయిదు వేల నగదు బహుమతి పరిచయ ప్రశంసా పత్రం లభిస్తాయి. సాహిత్య అవార్డు పొందే వ్యక్తికి పదివేల నగదు బహుమతి, పరిచయ ప్రశంసాపత్రం లభిస్తాయి.

**స్వాతంత్ర్య సమర యోధుడైన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ప్రముఖ రాజకీయవేత్త కూడా.** నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో 1907, ఆగస్టు 5న జన్మించారు. మచిలీపట్నం నేషనల్ కాలేజీలో చదువుకున్నారు. 1937లో రాజాజీ నేతృత్వంలో రూపొందించిన మొదటి కాంగ్రెస్ క్యాబినెట్‌లో అందరికంటే చిన్న వయసు గలవాడు గోపాలరెడ్డి గారే. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పండిట్ నెహ్రూ క్యాబినెట్‌లో యూనియన్ మినిస్టర్‌గా, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా ఎనలేని సేవలందించారు. 1972లో క్రియాశీలక రాజకీయాలనుంచి తప్పుకున్నారు. కవిగా తనకంటూ ప్రత్యేక స్థానం కల్పించుకున్న గోపాలరెడ్డి గారు పన్నెండు సంవత్సరాల పరిధిలో 16 కవితా సంపుటాలు ప్రచురించారు.

సాహిత్య అవార్డు పొందిన డాక్టర్ తిరుమల రామచంద్ర బహుభాషావేత్త, రచయిత, జర్నలిస్టు కూడా. "మన లిపి పుట్టు పూర్వోత్తరాలు" "మూడు శిఖరాలు" వంటి రచనలతో తెలుగుసాహిత్యాన్ని సుసంపన్నం చేశారాయన, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు ఇటీవల ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించారు.

# అమ్మ

"ప్రతి బిడ్డా నేర్పకుండా నేర్చుకునే మొదటిమాట 'అమ్మ'...ఈ మాటకి భాషాభేదం లేదు. ఏ భాషలోనైనా దాని భావం ఒక్కటే. ఈ ప్రపంచంలో పోగొట్టుకుంటే తిరిగి రానిదేమైనా ఉంటే అదే."

రాసిన కథ మరోసారి చదువుకుని తృప్తిగా నిట్టూర్చాడు భైరవమూర్తి.
చాలా పాపులర్ పత్రిక ప్రకటించిన కథల పోటీకి పంపబోతున్నాడు దాన్ని. మరోసారి చూసి అంతకుముందే అనుకున్నట్టుగా 'తల్లి మనసు' అన్న పేరే పెట్టేడు. ఆ రోజేదాన్ని పోస్టు చేసాడతను.

"ఈ రోజుతో ఈ సంగతి అటో..ఇటో తేలాల్సిందే....

"అబ్బా చిన్నగానే, ఎవరయినా వింటారు."

"వింటే..వింటే నా కేంటండి — మీ అవ వెధవ దగ్గు వినలేక రోజంతా చస్తుండి నేను ఇ... ఇప్పుడే చస్తున్నాను. ఆ జబ్బు మనిషి ఈ ఇంట్లో ఉంటే నేనటుకు ఇంట్లో ఉండను. మాయదారి దగ్గని — ఏ అంటురోగమో అయితే...నాపిల్లలు సుకంధులు — పిలుకాకపోతే చెప్పండి తక్షణమే పోతానేను"

"అబ్బ వినిపించుకోవు కదా జబ్బు మనిషి — అసలే చలిరోజులు ఎక్కడుంచుతాం చెప్పు పైగా చుట్టు పక్కలు ఏమనుకుంటారు?"

"నా కనవసరం. ఆ మనిషున్న ఇంట్లో ఒక్క క్షణం నే ఉండను. ఇప్పుడే నా పిల్లల్ని తీసుకు"....

"ఉహూ! ఊరుకో...సర్లే..ఎక్కడికి మార్చాలా అని చూస్తున్నా...."

"ఎక్కడికేమిటీ ఇంత విశాలంగా పంచుంటే మా..ఎదో మూల పారేస్తే సరి"

"పంచంటే...అది మరీ బయలైపోదూ..."

"ఏమిటీ మహా సుకుమారాలు పోతున్నారు — ఇట్లయితే నే మా ఇంటికి..."

"సరిలే...మారుస్తానన్నాగా..." సర్ది చెప్పాడు భార్యకి భైరవమూర్తి

ఆ సాయంత్రమే మధ్య గది నుండి అతని తల్లి మంచం పంచలోకి మారింది.

"టెలిగ్రామ్"......

హడావుడిగా అందుకుని విప్పిచూసి అన్నాడు భైరవమూర్తి హుషారుగా,

"ఏమేవ్! నా 'తల్లి మనసు' కథకి ఫస్టుప్రైజొచ్చింది"

అప్పటికి అతని తల్లి చనిపోయి పది రోజులయింది.

—నాగరాజు గంధం